# లవ్‌గేమ్

ఆట మొదలు పెట్టి పది నిముషాలయింది. జనంతో గ్యాలరీలు పూర్తిగా నిండిపోయినాయి. ఇంకా చాలామంది గుంపులు గుంపులుగా నిలబడి వుత్సుకతతో ఆటని తిలకిస్తున్నారు. వారం రోజులుగా జరుగుతున్న ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నమెంటులో ఆరోజు ఫైనల్సు, ఆంధ్రజట్టు బెంగాల్ జట్టు పోటీపడి ఆధిక్యత కోసం పోరాడుతున్నారు. ప్రేక్షకులు వూపిరి బిగబట్టి కనురెప్ప వాల్చకుండా చూస్తున్నారు.

ప్రత్యేక ఆహ్వానితుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల్లో, ముందువరసలో కర్చునుంది రోహిణి. ఆమెకి పాతికేళ్ళకిపైగానే వయస్సుంటుంది. అటు ఎరుపుకీ ఇటు నలుపుకీ రాజీచేస్తున్న దానిలా మధ్యస్థంగా వుంటుంది. ఆమెది చాలా అరుదుగా కన్పించే అందం. కాని ఆ అందం ఆమెలో ఏ అవయవంలో ఏ విధంగా అమర్చబడివుందో విడమర్చి చెప్పటం కష్టం. విశాలమైన ఆ కళ్ళలోనా? ఆ లేత పెదవుల్లోనా? వుబ్బిన ఆ గుండెల్లోనా? పొడుగాటి ఆ జెడలోనా? చీరకట్టిన పద్ధతిలోనా? సమ్మోహితులను చేసేటట్లు నవ్వే ఆ తీరులోనా? ఏమో చెప్పటం కష్టమేమరి.

జనంలో కూర్చున్న ఆమె చేతిలో వున్న బైనాక్యులర్స్‌లోంచి మాటిమాటికి ఆత్రంగా చూస్తోంది, కాని ఆమెదృష్టి మొత్తం ఆటపైన, ఆటగాళ్ళపైన కాక ఒకేఒక వ్యక్తిపైన కేంద్రీకరింపబడుతోంది. అతడు రేసుగుర్రంలా విజృంభించి, వీరవిహారం చేస్తూ అతి చాకచక్యంగా ఆడుతున్నాడు.

రోహిణి తిలకిస్తోంది...

ఆ వ్యక్తిపేరు శివరామ్ అతడిపేరు ఫుట్‌బాల్ ప్రపంచంలో ఎంతో ప్రసిద్ధి అతడికి సరైన ఆటగాడు ఆంధ్రదేశంలో మరెవరూ లేరని అంటూ ఏకగ్రీవంగా వొప్పుకునే నిజం. స్కూల్లో వున్నప్పుడే అతడి ప్రతిభ గుర్తింపబడింది. కాలేజీలోను, అటుతర్వాత గూడా అతగాడు ఆ ఆటలో చాలా సాధన చేసి వున్న తస్థితికి చేరేడు. అతను ప్రస్తుతం పన్చేస్తున్న బ్యాంకు వుద్యోగం కూడా అతడి ఆటనిచూసి, ప్రతిభని గుర్తించి ఇచ్చారేగాని, యూనివర్శిటీ వాళ్ళిచ్చిన డిగ్రీచూసికాదు.

ఆట జోరుగాసాగుతోంది. ఇరుపక్షాల వారు అత్యంత వుత్సాహంతో పట్టుదలతో ఆడుతున్నారు.

శివరామ్ విజృంభించేడు. జనం పెద్దగా 'కమాన్ శివరామ్' అంటూ తమ అభిమానాన్ని, అతడిపైన నమ్మకాన్ని ప్రకటిస్తున్నారు. ఆవతలి పక్షంవారు అసలు శివరామ్‌కి బంతిని దొరకనీయటంలేదు. అతడికి గాని బంతిదొరికిందంటే దాంతో పాటుగా అతడు సహస్ర అడ్డంకులొచ్చినా గోల్లోకి వెళ్ళిపోగల దిట్టని వాళ్ళకి తెల్సు. అందువల్ల బెంగాలు జట్టు బాబులందరూ అతడి చుట్టూ కమ్ముకుని, మంత్రివర్యులకీ, నక్సలైట్లకీ పోలీసువారు కల్పించే రక్షణలా వెయ్యికళ్ళతో గమనిస్తున్నారు.

జనం అరుస్తున్నారు. గోలగా వుంది. రోహిణి బైనాక్యులర్‌లోంచిచూస్తూ, అరుర్థాతో లేత పెదవిని అప్రయత్నంగాకొరికేస్తోంది.

అంతలో శివరామ్‌కి బంతి దొరికింది.

జనంలో కోలాహలం. 'శివరామ్– కమాన్' అంటూ అరుస్తున్నారు. ఈలలువేసి చప్పట్లుచరుస్తూ ఆనందాన్ని ప్రకటిస్తున్నారు

శివరామ్ బంతిని అతిలాఘవంగా కాళ్లతో తిప్పేస్తూ వచ్చిన ఆవరోధాలన్నింటిని తప్పించుకుంటూ గమ్యంవైపు రేచులా వెళ్ళి పోతున్నాడు...

జనం గోలగా అరుస్తూ లేచినిల్చున్నారు.

రోహిణి పెదవిని నెత్తురుచిమ్మేలా కొరుకుతూ, ఆత్రంగా వూపిరిబిగపెట్టి చూస్తోంది.

కాని....

అంతలో బెంగాలుజట్టులోని ఒక ఒంగోలు గిత్తలాంటివాడు వెనకనించి పరిగెడుతున్న శివరామ్ కాళ్ళకి అడ్డుగా కాలు పెట్టేడు. అంతే– శివరామ్ ఒక్కసారిగా నేలకరిచేడు.

జనంలో ఆదుర్దా, కోపం, కోలాహలం–

రోహిణిగూడా అతడు క్రిందపడగానే కెవ్వుమని అరిచిలేచి నిల్చుంది.

అంతా అరక్షణంలో, రెప్పపాటుకాలంలో జరిగింది.

క్రిందపడ్డశివరామ్ చటుక్కున మెరుపు వీరుడిలాలేచాడు అది ఎవ్వరూ ఊహించని విషయం ఆ విధంగా లేచిన అతడు ఒక్క అంగలో కసిగా, పట్టుదలగా తిరిగి బంతిని తనస్వాధీనంలోకి తెచ్చుకుని, గురిపెట్టి బలంగా ఒడుపుగా, నేర్పూ, అన్నిటికిమించి కోపంగా గమ్యంవైపుగా తన్నేడు తన్నిన బంతి ఏమైందో ఎటువైపుగా వెళ్లిందో గూడా చూసుకోక, బేలన్స్ తప్పుళ్ళీ క్రిందపడిపోయేడు.

కాని శివరామ్ గురి తప్పలేదు. అతడు బంతిని తన్నిన విధానంలో ఎంతో నేర్పుంది. ఎన్నో సంవత్సరాల అనుభవముంది. ఆంచేత ఆ బంతిసరాసరి తుపాకీ గుండులాగా గోల్లోకివెళ్ళింది.

అంతే!

జనంలో వుత్సాహం ఒక్కసారిగా పెల్లుబికింది.

సంతోషం కట్టలు తెంచుకుంది జనమంతా గ్రౌండులోనికి ప్రవేశించి పడిపోయిన శివరామ్‌నిపైకెత్తి భుజాలపైన కూర్చోపెట్టుకున్నారు.

శివరామ్ వాళ్ళకి హీరో– దేవుడు.

మట్టికొట్టుకుపోయిన బనీను, నిక్కరు చెమటలు దిగ్గారుతున్న అతడివొళ్ళు వాళ్ళకి అతడు సాధించుకున్న బంగారం పతకాల్లా అనిపించినాయ్ ఆ విధంగా అతడిని పైకెత్తి వూరేగింపులాగా, గౌండుమధ్యలోకి తెస్తున్నారు. అతడితో కరచాలనంకోసం, అతడి కటాక్షవీక్షణాల కోసం జనం తహ తహలాడుతూ దగ్గర దగ్గరగా రావటంచేత త్రొక్కిసలాట మొదలైంది.

రోహిణిగూడా లేచి కుర్చీలని తన్నుకుంటూ గ్రౌండు మధ్యకి వచ్చింది. శివరామ్‌ని అభినందించటానికి ఆవేశంగా జనంలోకి ప్రవేశించింది.

అంతలో కార్యనిర్వాహకుల కోరికపై పోలీసులు రంగప్రవేశం చేసారు. జనాన్ని చెదరగొట్టే ప్రయత్నం మొదలుపెట్టటంతో వాళ్ళు శివరామ్‌ని దింపి తిరిగి గ్యాలరీల వైపుగా పరిగెత్తారు.

అపుడు రోహిణికి అవకాశం లభించింది. అతడిపట్ల ఆమె పెంచుకున్న అభిమానం, ఎన్నో సంవత్సరాల తర్వాత కల్సుకున్న సంతోషం, ఆవేశరూపంలో బయల్పడగా ఒక్కసారిగా అతడిని కౌగిలించుకుని, పుసుక్కున అతడి చెంపపై ముద్దెట్టుకుని 'రియల్లీ– యు ఆర్ గ్రేట్– శివరామ్' అంటూ అతడి చెయ్యినందుకుని వూపేస్తోంది.

ఆమెని చూసిన శివరామ్ ఆశ్చర్యపోయాడు– నివ్వెరపోయాడు, వూపిరితియ్యటం గూడామరచి, రాయిలానిలబడి 'నువ్వా రోహిణీ' అన్నాడు అప్రయత్నంగా.

అంతలో...

ఆట తిరిగి మొదలు పెట్టవలసి వుండటం చేత పోలీసులు జనాన్ని బయటకిపంపించి, గ్రౌండుని ఖాళీచేయించారు. తిరిగి రిఫరీకూత కూసేడు– రోహిణి అతడి చెయ్యి పట్టినొక్కుతూ 'ఆట పూర్తయ్యాక నీకోసం ఎదురుచూస్తుంటాను. మర్చిపోకుసుమా' అని అతడిచెయ్యిని మరొక్కసారి స్పృశించి, తిరిగివెళ్ళి తనస్థానంలో కూర్చుంది.

ఆమెని చూసేక శివరామ్‌లోని వేడినెత్తురు చల్లబడింది. బలంనశించి నీరసం ఆవహించింది. ఎన్నేళ్ళకి తిరిగి రోహిణి కన్పించింది! తన మనసుని బంతిలా చేసుకునాడుకుని, అంతర్ధానం అయి, తిరిగి ఈరోజున ఇక్కడ ఈ విధంగా దర్శనమివ్వటం అతడికంతా అయోమయంగా, వింతలాగా నమ్మలేని నిజంలా అన్పించింది.

తిరిగి ఆట మొదలైంది

కాని శివరామ్ అంతకుమునుపు మనిషి కాదు– నిస్సత్తువనింపుకుని నిరుత్సాహంతో, కాళ్ళలో వోపికలేనట్లు, మొట్టమొదటిసారిగా గ్రౌండ్‌లోకి వచ్చిన వాడిలా ఆడసాగాడు. జనం నిరుత్సాహాన్ని ప్రకటిస్తున్నారు. ఆంధ్రజట్టులోని తోటి

ఆటగాళ్ళు కంగారుగా 'శివరామ్, ఏమైంది దెబ్బతగిలిందా. ఎందుకంత డల్‌గా అయిపోయేవ్? కమాన్ హర్రియ్యప్' అంటూ తమ ఆదుర్దాని ప్రకటించసాగారు. 'అబ్బే ఏంలేదు. ఆయామ్ ఆల్‌రైట్' అన్నాడేగాని శివరామ్‌లో ఆస్పార్క్ ప్రతిభలోపించింది.

అదనుకనిపెట్టి బెంగాలు జట్టువారు విజృంభించేరు. శివరామ్‌లేనిజట్టు, వాళ్ళకి పెద్దవరం. కొట్టినపిండి పదినిమిషాల్లో వాళ్ళుసునాయాసంగా రెండు గోల్స్ చేసేరు. బెంగాలుజట్టు గెల్వబోతోంది. ఇక ఆటముగియటానికింక అయిదునిముషాలే వుంది.

జనంలో కలకలం మొదలైంది శివరామ్ పైవాళ్ళకి పట్టలేనంత ఆగ్రహం కల్గింది. తమ ప్రాంతపు జట్టు ఓటమికతడే కారణమని గ్రహించిన వాళ్ళకి వెర్రి ఆవేశం ఆవహించి వుగ్రరూపాలని ధరించేరు. కొద్ది క్షణాలక్రితం భుజంతట్టి, కరచాలనం చేసి, ఆకాశానికెత్తిన జనం ఇపుడు ఆగ్రహావేశాలతో చుట్టుముట్టేరు దుర్భాషలాడి చేతికందిన రాళ్ళని అతడిపైకి విసిరి వాళ్ళకోపాన్ని ప్రకటించారు. అతడి తలపైన చేతులకి గాయాలు అభిమానుల గుర్తుల్లాగా తగిలాయ్.

జనం– అభిమానంవస్తే ఆకాశానికి, ఆగ్రహిస్తే పాతాళలోకానికి పంపించే అద్భుత శక్తి ఆవిషయం అతడికి తెల్సు. అందుకే అంతటి బాధలోనూ సన్నగా నవ్వుకుంటున్నాడు.

పోలీసులు తిరిగి రంగ ప్రవేశం చేసి జనాన్ని చెల్లాచెదురుగా చేసారు. ఆవేశపరులైన జనం అక్కడున్న ఫర్నిచర్‌ని, మైకుని ధ్వంసం చేసి తమ ప్రతిభని ప్రకటించారు.

నిర్వాహకులు ఆటముగిసినట్లు బెంగాలు జట్టువారు గెలిచినట్లు ప్రకటించారు. పోలీసులు జనాన్ని వెంటపడి తరమసాగారు.

రోహిణి గబగబావచ్చి 'దెబ్బలు బాగాతగిలాయా' అనడిగింది అతడిని చుట్టేసుకుంటూ.

శివరామ్ ఆమెవంక భావరహితంగా చూసాడు. తర్వాత వెళ్ళిమట్టిపట్టిన నిక్కరు బనీను విప్పి ప్యాంటు షర్టు ధరించాడు. ప్రథమ చికిత్స తాలూకు మనుషులు గాయాలైన చోట టించరుపూసి కట్టుకట్టారు.

శివరామ్ తన సామానంతా చిన్న ఎయిర్‌బ్యాగ్‌లో సర్దుకుని బయల్దేరాడు. రోహిణి 'మాయింటికెళదాంపద' అందతనకేసిచూస్తూ.

అతడురానని అనాలనుకుని, ఆ మాటని అతికష్టంపైన ఆపేడు. జీవితంలో ఎప్పుడైనా తిరిగి రోహిణిటస్థపడితే ఆడగాల్సిన ప్రశ్న ఒకటి అతడికి జీవితపు ధ్యేయంలా లక్ష్యంలా మిగిలింది.

ఆ అదను లభించనందువల్ల మౌనంగా ఆమె వెంటే నడవసాగాడు.

గ్రౌండులో జనం గుంపులుగుంపులుగా నిల్చుని ఆట గురించి చర్చించుకుంటున్నారు. కార్యనిర్వాహకులు విరిగిపోయిన కుర్చీలని, మైకులను చూసి నష్టం ఏ మాత్రం వుంటుదాని లెక్కగట్టే ప్రయత్నంలో వున్నారు. జనాన్ని వెంటపడి తరిమిన పోలీసులు ఇపుడా జనం వద్దనే బీడీలు, సిగరెట్లు పుచ్చుకుని సుఖంగా త్రాగుతున్నారు.

రోహిణి అక్కడనుంచి కదలి వరుసగా వున్న కార్లవైపుగా వెళ్ళింది. శివరామ్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఆమె నల్లటి ఫియట్‌కారుని బయటకుతీసి డోర్ తెరచి పట్టుకుని అతడినాహ్వానించింది. శివరామ్ ముందుసీట్లో ఆమె ప్రక్కన కూర్చున్నాడు.ః

కాదు కదిలింది.

ఆమె అతి నైపుణ్యంతో స్పీడుగా డ్రైవ్ చేస్తోంది. అతడాశ్చర్యంగా చూసి. 'బాగా డ్రైవ్‌చేస్తున్నావ్ అన్నాడు'

ఆఎమ అతడి అజ్ఞానానికి జాలిపడుతున్నట్లు నవ్వి 'భలేవాడివే అసలు ఈ కారు నా గురించే కొన్నారాయన' అంది అలా అంటున్నపుడు ఆమె మాటల్లో గర్వం తొణికిసలాడింది.

శివరామ్ మరేం మాట్లాడక మౌనంగా కూర్చుని కదిలిపోతున్న దీపపు స్తంభాలని, ట్రాఫిక్‌ని చూస్తున్నాడు. చెమటతో తడిసిన శరీరానికి చల్లగాలి తగిలి హాయిగా సుఖంగా వుందనిపించింది.

డ్రైవ్ చేస్తున్న ఆమె వున్నట్లుండి 'మొదటిగోల్‌పడేవరకు బ్రహ్మాండగా ఆడి, అటుతర్వాత ఆటని నాశనం చేసావ్. అసలు నాకెంత కోపం వచ్చిందంటే ఆ జనంతో పాటు నేనూ ఒక రాయి విసిరి చక్కా పోదామనిపించింది' అన్నది మెల్లిగా.

శివరామ్ ఏమీ బదులివ్వక ఒక్కసారి ఆమెవంకచూసి తల త్రిప్పుకున్నాడు. అతనికేదో అర్థంకాని విషయం కాస్తకాస్త అర్థమవుతున్నట్లు.. ఇన్నేళ్ళుగా తన మనోవీధిలో క్రమ్ముతున్న నల్లతెల్లమబ్బులు తొలగిపోతున్నట్లు అన్పించింది.

ఆమెకారుని పెద్దబిల్డింగ్‌లోనికి పోనిచ్చి ఆపింది.

అది రెండంతస్థుల భవనం. తెల్లటి ఆయిల్ పెయింట్సుతో ఎంతో అందంగా, ముచ్చటగా వుంది. అక్కడి పోష్‌లొకాలిటీలోని ఇతర భవనాలకి ఏం తీసిపోనట్లు హుందాగా వుంది.

ఆమె హీల్స్‌ని టకటకలాడిస్తూదిగింది. అతడూ దిగాడు.

“ఇదే మా ఇల్లు కట్టించి రెండేళ్ళయింది. అప్పట్లో నాలుగులక్షలయింది” గర్వంగా చెప్పుకుపోతోంది.

శివరామ్ యాంత్రికంగా వింటూ, యాత్రికుడిలా వింతగా చూస్తున్నాడు. ఆమె చకచకా పైకి దారితీసింది. అతడిని ఒకగదిలో కూర్చోమని తాను ప్రక్కనున్న మరోగదిలోకి మాయమైంది.

అతడికంతా ఆశ్చర్యంగా వుంది. ఒకప్పటి తన ప్రాణం, తన జీవితం, తనవూపిరి, అన్నీ తనే అయిన రోహిణి దర్శనమివ్వటం ఒక ఆశ్చర్యమైతే, ఆమె గృహిణిగా, శ్రీమంతురాలిగా కన్పించటం మరో ఆశ్చర్యకరమైనవిషయం.

కొద్దిసేపటికి నౌకరు గదిలోకొచ్చాడు. ప్రక్కనేవున్న ఫ్రిజ్‌లోంచి బీర్‌సీసాని తీసి, దాన్ని తెరచి గ్లాసులోపోసి, శివరామ్‌కి దగ్గర్లోనే వున్న టీపాయిపై వుంచాడు.

అది చూసి శివరామ్ బిత్తరపోయాడు. ‘ఇదెవరికి?’ అన్నాడు.

“మీకేనండి– అమ్మగారు ఇమ్మన్నారు” అనేసి బయటికెళ్ళాడు.

శివరామ్ ఆశ్చర్యంలోంచి పూర్తిగా తేరుకోకముందే, అదే నౌకరు మళ్ళీ గదిలోకివచ్చి, చేతిలో వున్న కాజూనెట్స్ ప్లేటు అక్కడుంచి, జేబులొంచి ఫారెన్‌సిగరెట్ ప్యాకెట్టు, అగ్గిపెట్టెకూడా అక్కడుంచి, తన పని పూర్తయినట్లు, సలాం చేసి వెళ్ళిపోయాడు.

శివరామ్ త్రాగుబోతుకాదు. అలాగని తాగనిబోతూకాదు. అప్పుడప్పుడు ముఖ్యంగా మ్యాచెస్ ఆడినరోజున అలసట తీరడం కోసం కొద్దిగా పుచ్చుకుంటాడు. అంచేత బీర్ త్రాగటం అసహజంగా అన్పించలేదు గాని, రోహిణి ఇంట్లో ఆమె ఆధ్వర్యంలో పుచ్చుకోవటం కాస్త ఇబ్బందిగా, ఏమిటోలా ఒక్క క్షణం అన్పించినా, వేడెక్కినబుర్ర, అలసిపోయిన శరీరం తొందరచేయటంలో, మరుక్షణం అతడు గ్లాసుపైకెత్తిగటగటా త్రాగేడు.

ద్రవం చిరుచేదుగా, చల్లగా, హాయిగా వుందనిపించిది.

అతడు మరోగ్లాసు పైకెత్తి పూర్తిగా త్రాగి టేబులు పై వుంచేడు. అతడికి కాస్సేపటి క్రితంకన్నా ఎంతో మెరుగ్గా విశ్రాంతిగా వుందనిపించింది. అతడు మరల సీసాలోని ద్రవాన్ని గ్లాసులోకి వొంపుతుండగా రోహిణి ఆ గదిలోకొచ్చింది.

ఆమె స్నానంచేసి ఇస్త్రీచీర ధరించి, స్లీవ్‌లెస్‌బ్లౌజు.... మొహానికి పౌడరు, స్నోలాంటి సామాగ్రి పుయ్యటం చేత మరింత అందంగా వుంది. జుట్టుని సగానికి మడిచి, రిబ్బనుతో ఆర్టిస్టిక్కుగా కట్టింది. వస్తూనే ప్రక్కనేవున్న కుర్చీని దగ్గిరిలాగి, అతడికెదురుగా కూర్చుంటూ ‘ఇంకా బీర్ కావాలంటే ఫ్రిజ్‌లో వుంటాయ్. హెల్ప్‌యువర్ సెల్ఫ్ మావారు రోజు ఒక బీరు లెక్క ప్రకారం పుచ్చుకుంటారు. అన్నట్లు నా పెళ్ళయ్యాక మనం కల్సుకోవటం ఇదే ప్రథమంకదూ’ అంటూ చివుక్కునలేచి టీ.వీ. పైనున్న ఫోటో ఫ్రేమునందుకుని అతడికందించింది.

అప్పటికి శివరామ్‌కి గ్లాసు పూర్తికావటంతో, ఆమె అందించిన ఆ ఫోటో వంక చూడనైనా చూడకుండా, లేచెళ్ళి ఫ్రిజ్ తెరచి మరో బీర్ సీసాని తెచ్చుకుని, ద్రవాన్ని గ్లాసులో పోసుకుంటూ ‘పెళ్ళయి ఎన్నేళ్ళయింది–’ అనడిగాడు.

ఆమె ‘ఏడేళ్లయింది ఇద్దరు పిల్లలు గూడాను’ అంది తలొంచుకుని.

“మీవారికి ఏం ఉద్యోగం”

“ఉద్యోగం కాదు. వ్యాపారం ఇంపోర్ట్ ఎక్స్‌పోర్ట్ వ్యాపారం. నెలకి ఇరవై రోజులు క్యాంప్స్‌లోనే వుంటారు ఇపుడు గూడా

క్యాంప్‌లోనే వున్నారు ఇంకా పదిరోజుల దాకా రారు".

శివరామ్ గ్లాసులోని ద్రవాన్ని ఒక గుటక వేసి, సిగరెట్‌తీసి వెలిగించాడు– అపుడు ఫోటోని చేతిలోకి తీసుకుని ఆ వ్యక్తిని పరీక్షగా చూసేడు.

అతడికి రోహిణీకన్నా రెండు మూడు సంవత్సరాల వయస్సు ఎక్కువగా వుండొచ్చు. నొక్కుల జుట్టు అమర్చినట్లు అందంగా వుంది. పెదిమలు బిగించినట్లు ముక్కు కొనతేలినట్లు వుండి, మొండివాడిలాగా, ముక్కుకి సూటిగా పోయేవాడిలా ధైర్యంగా అవుపిస్తున్నాడు.

అతడా ఫోటోని పరీక్షగా చూడటం గమనించి రోహిణీగర్వంగా చెప్పసాగింది. "అసలు మా పెళ్ళికూడా చాలా యాక్సిడెటల్‌గా జరిగింది. ఒకరోజు మా ఫ్రెండ్ మ్యారేజీకని వెళ్ళాను. ఆయనగూడా ఆ పెళ్ళికొచ్చి అక్కడనన్ను చూసేరు. అంతే అప్పటికప్పుడు పెళ్ళాడతానని కబురంపారు. మాఇంటి పరిస్థితులు నీకు తెల్సుగా! మా నాన్న కట్నం ఇవ్వలేనని చెప్పారు. అన్ని ఖర్చులు తనే భరించి పెళ్ళి చేసుకున్నారు" శివరామ్ చేతిలోవున్న ఫ్రేమ్‌ని తిరిగి టీపాయిపై వుంచి, గ్లాసుని చేతిలోకి తీసుకుని గడగడా త్రాగి, చేదుగా మొహం చిట్లించి "రొహిణీ– ఒక విషయం అడుగుతాను– సూటిగా బదులిస్తావా. నీవు కల్సినపుడు ఈ ప్రశ్న అడగాలని ఎన్నేళ్ళుగానో అనుకుంటున్నాను" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా 'ఏమిటది' అనడిగింది.

అతడు సిగరెట్టు దమ్ముపట్టి 'ఎందుకిలా చేసేవు?' అన్నాడు. అతనలా అంటున్నప్పుడు ముక్కులోంచి, నోట్లోంచి పొగ తెరలు తెరలుగా వస్తూ గుండెలో అగ్ని ప్రమాదం సంభవించిందేమో ననిపిస్తోంది.

'ఏం చేసేను?' అందామెచిలిపిగానవ్వుతూ

'నన్ను ప్రేమించానని నేను లేకుండా జీవించలేనని, నన్ను చూడకుండా క్షణం గూడా నిలవలేనని ఏవేవోచెప్పి వేరేవ్యక్తి నెలా వివాహం చేసుకున్నావ్?'

ఆ ప్రశ్న విన్న ఆమె చాలా తేలికగా నవ్వి 'ఓ అదా– నిన్ను ప్రేమించాను, అది పచ్చినిజం కనుకనే ఉదయం పేపర్లో చూసి ఎండలోపడి నీ కోసం వచ్చాను".

అతడు తెల్లబోయి చూస్తున్నాడు.

"కానీ శివరామ్! ప్రేమవేరు. జీవితం వేరు నీకు తెల్సే వుంటుంది. పెళ్ళికి ముందు ఎంతఘోరమైన జీవితాన్ని గడిపేనో– వయసు విరిసిన శరీరాన్ని కప్పుకోవటానికీ సరైన పావడాగూడా లేక ఇంట్లోనే వుండిపోయేదాన్ని అబ్బ – ఇప్పటికీ తల్చుకుంటేనే భయం వేస్తుంది. ఎలా బ్రతికామాని ఆశ్చర్యం వేస్తుంది. అటువంటి పరిస్థితుల్లో స్థితి పరుడైన కుర్రాడొచ్చి పెళ్ళిచేసుకుంటానంటే కాదనలేకపోయాను. అనుభూతికోసం ప్రేమ అనుభవించటానికి జీవితం– కాదంటావా?"

శివరామ్‌కి ఒక్కక్షణం ఏం చెప్పాలో, అసలేం మాట్లాడాలో అర్థంకాక గ్లాసెత్తి దాన్ని ఖాళీచేసేశాడు– అతడి కళ్ళు ఎర్రబడ్డాయ్ 'థాంక్స్ రోహిణి– ఇప్పటికైనా నీ పాలసీని చెప్పి కళ్ళు తెరిపించావు– ప్రేమ వేరు– జీవితం వేరు – అహహ' అంటూ పెద్దగా భయంపుట్టించేలా నవ్వేడు.

రోహిణికి భయంవేసింది. అతడిధోరణి మార్చటానికన్నట్లు.

"అవునూ– ఇంతకీ నీ గురించి ఏం చెప్పావు కాదేం' అంది.

పూర్తయిన సిగరెట్టుని కసిగా యాష్‌ట్రేలోకి నొక్కుతూ 'నాగూర్చి చెప్పేందుకే ముంది? అదే జీవితం– అర్థంలేని పిచ్చిగీత లాంటి జీవితం. ప్రేమని, ఆదర్శమనీ, నీతి నిజాయితీలని చెప్పుకుంటూ జీవితాన్ని బలిచేసుకున్న పిచ్చివాడిని– నీ అంత తెలివితేటలు, ముందుచూపు నాకులేవు రోహిణి'

"అంటే నువు ఒంటరిగాడివేనా– ఇంకా పెళ్ళికాలేదా?" అంది ఆశ్చర్యంగా.

"పెళ్ళి చేసుకోలేదానడుగు– సమంజసంగా వుంటుంది."

ఆమె రెండు క్షణాలు మౌనంగా తలొంచుక్కూర్చుని, ఆపైన 'నాపైన కోపమా– నువ్వే శిక్షవిధించినా సిద్ధమే' అంది.

"నీపై నాకెందుకుండాలి కోపం? అయినా నాకిప్పుడే అర్థమైంది. నువు నన్ను ప్రేమించలేదు– అభిమానించావు నువు నా అభిమానివి– అంతే!"

"ఎలా చెప్పగలవ్?"

"చెప్పవచ్చు. చాలా తేలిక. ప్రేమవేరు అభిమానంవేరు. ప్రేమ మనిషిని బ్రతికిస్తుంది. బ్రతకటానికి ఆశని కల్పిస్తుంది. కాని అభిమానం అంటురోగం లాంటిది. అది మనిషిని వున్మత్తుడిని చేసి పతనానికి ప్రథమ సోపానం అవుతుంది."

"నాకేం అర్థం కావటం లేదు"

"అర్థం కాకపోవటానికి పెద్ద విశేషమైన విషయం కాదు, నువ్వు నాలోవున్న నైపుణ్యంపట్ల, ఆటగాడిపట్ల పెంచుకున్న అభిమానానికి ప్రేమనే పెడర్థం చెప్పుకోవటం వల్ల ఇంత కల్లోలం జరిగింది.

రచయితలు, కళాకారులు, ఆటగాళ్ళు– వీళ్ళందరిపట్ల ప్రజలు కురిపించేది అభిమానమేగాని, ప్రేమకాదు. ఆ ప్రముఖుల్లో ఏ ఒక్కరికైనా ఉపద్రవం ఏర్పడితే ఆ అభిమానుల్లో ఏ ఒక్కరూవచ్చి వాళ్ల కళ్ళ నీళ్ళు తుడవరు. కాని ప్రేమ అలాకాక కొండంత అండగా నిలుస్తుంది–" మాట్లాడుతున్న వాడల్లా చటుక్కున ఆపితలవెనక్కి వాల్చి కూర్చుండి పోయాడు.

రోహిణి ముఖంలో అదుర్దా కన్పించింది. చివుక్కునలేచి, ఆ గది తలుపు గడియపెట్టి, అతడికి ప్రక్కగా సోఫాలో కూర్చుని అతడి తలని గుండెలపైకి తెచ్చుకుంటూ "శివరామ్– నువ్వంటే నాకు పిచ్చి. నీమీది మమకారం, ప్రేమ ఇంకా చెక్కుచెదరలేదు. ఇపుడు–ఈ క్షణాన నేను నీదాన్ని– నీ యిష్టం– " అంది.

శివరామ్ ఒక్కసారిగా ఆమె చేతుల్లోంచి తలని విదిలించుకుని చువ్వలాలేచి నిల్చున్నాడు.అతడి ఎరుపెక్కిన కళ్ళు చమర్చాయి. త్రాగిన ద్రవంవల్లకాక ఆలోచనల చేతి నిషా ఎక్కినవాడిలా కాస్త వూగుతున్నాడు.

"రోహిణీ, ఇటువంటివి నాకసహ్యం. ప్రేమకోసం ఒకరు, పెళ్ళికిహోదాకి ఒకరు అభిమానించటానికి ఒకరు– ఛఛ– ఇలాంటి పన్చెయ్యటానికి సిగ్గుగాలేదూ? ఇలా ప్రవర్తించటంవల్ల నవ్వు నమ్మిన సిద్ధాంతానికి నీకు సంఘంలో ఒక వున్నత స్థానాన్ని కల్పించిన అతగాడికన్యాయం చేస్తున్నావ్. నీకు ప్రేమవేరు– జీవితం వేరు. కాని నాకు ప్రేమే జీవితం. జీవితమే ప్రేమ. అందువల్ల ఇప్పుడు మనిద్దరం వేరువేరు సమాంతర రేఖలపై ప్రయాణిస్తున్న వ్యక్తులం. మన కలయిక అసాధ్యం. గుడ్‌బై" అని వెళ్ళటానికి సన్నద్ధుడైనాడు.

ఆమె కంగారుగా సన్నగా ఏడుస్తూ 'నన్ను క్షమించలేవా– నిజంగా నువ్వంటే నాకు పిచ్చి– నిజం శివరామ్ నిజంగా' అంది అతడి కడ్డంగా నిల్చుని అతను ఆమెని సుతారంగా ప్రక్కకి నెడుతూ, తలుపు గడియ తీసి, బయటకు కాలుపెట్టబోతూ 'నిన్ను క్షమించటానికి నేనవర్ని? అయినా నీ జీవితం నీయిష్టం నేను కోపంచేతనే వెళ్ళిపోవటం లేదు. మళ్ళీ ఎప్పుడైనా వస్తాను. కాని ఈసారి ఒంటరిగా మాత్రంరాను. పెళ్ళిచేసుకొని నా భార్యతో సహా వస్తాను.' అనేసి తలుపు తెరచి వెళ్ళిపోయాడు.

గదిలో అలుముకున్న గంభీర వాతావరణంలో దూరమవుతున్న అతడి అడుగుల చప్పుడుని ఆలకిస్తూ పమిటకొంగుతో కళ్ళు తుడుచుకుంది రోహిణీ!